పేదల సొంతింటి కల సాకారం

జగనన్న కాలనీల్లో ముమ్మరంగా గృహ నిర్మాణాలు
- 11,924 గృహాల మంజూరు
- నియోజకవర్గంలో 2,561 ఇళ్ల నిర్మాణం పూర్తి


నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 122 లేఅవుట్లలోను, సొంత స్థలాలు ఉన్న వారికి కలిపి ప్రభుత్వం 11,924 గృహాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో సొంతిల్లు నిర్మించుకోవాలనే పేద కుటుంబాల కల కార్యరూపం దాలుస్తోంది. ఇదివరకెన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా ఆ కలను సాకారం చేస్తుండటంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. పక్కా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తూ వాటి నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ రోజుల్లోనే, అవినీతికి ఆస్కారం లేకుండా, ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందజేయడమే కాకుండా ఇళ్లను సైతం మంజూరు చేసింది. దీంతో పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తాము కొంత మొత్తాన్ని జత చేసుకుని గృహాలను నిర్మించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు స్థలాన్ని ప్రభుత్వం పేదలకు అందజేసింది. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల సొమ్మును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లోనే జమ చేస్తోంది.

తక్కువ ధరకే సిమెంట్, స్టీల్
నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను సరఫరా చేస్తోంది. ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన సిమెంట్, స్టీల్, ఇతర వస్తువులను మార్కెట్ ధర కంటే తక్కువకే అందిస్తోంది. ఇసుకను మార్కెట్ యార్డులో స్టాకు పాయింట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి అందిస్తోంది. అలాగే లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఎదురైతే వలంటీర్ వద్ద ఉన్న యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే స్థోమత లేని వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ల నుంచి లబ్ధిదారులకు పావలా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తోంది.

సాఫీగా గృహాల నిర్మాణం
నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన గృహాల్లో ఇప్పటివరకు 2,561 గృహాలు నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాయి. మిగిలిన గృహాల నిర్మాణం ప్రారంభమై పలు దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. లేఅవుట్‌లలో నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నీటి వసతిని కల్పించింది. ప్రతి లేఅవుట్‌లో విద్యుత్ సరఫరా సదుపాయంతో పాటు బోర్లు వేసి నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడంతో నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా ఉంది.

నూజివీడు నియోజకవర్గంలో నిర్మిస్తున్న గృహాల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తయినవి
నూజివీడు(అ)	3,358	1,388	1,271	151	57	493
నూజివీడు	3,712	1,422	604	186	103	1,231
ఆగిరిపల్లి	2,445	948	501	88	71	837
ముసునూరు	1,070	221	149	8	0	0
చాట్రాయి	1,039	238	111	9	0	0


నిర్మాణం పూర్తి చేసుకున్న గృహం

లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలి

లబ్ధిదారులు మరింత ముందుకు వచ్చి ప్రభుత్వ పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి. ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలను అందిస్తోంది. గృహాలను నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు. వారికి ఇస్తే మరింత వేగవంతమవుతాయి.
– వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ, నూజివీడు

ప్రభుత్వ తోడ్పాటుతో ఎంతోమంది పేదలకు లబ్ధి



రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోంది. ఇళ్ల స్థలాలను మంజూరు చేయడమే కాకుండా గృహాలను మంజూరు చేసి రూ.1.80 లక్షలను అందజేస్తోంది. ప్రభుత్వ తోడ్పాటుతో ఎంతో మంది పేదలు గృహాలను నిర్మించుకుంటున్నారు. కొత్త ఊళ్లు ఏర్పడుతున్నాయి.
– జీ విజయ్, నూజివీడు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరు సచివాలయం–1 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..
నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు శ్రీనివాసనగర్, కోయపేట, సిద్ధార్థ నగర్, పంట కాలువ రోడ్ ఏరియా వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలు సాధించాలి


తిరువూరు గ్రంథాలయంలో బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ సతీష్


మైలవరం శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి


కొండపల్లిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన గ్రంథాలయ అధికారులు

తిరువూరు: విద్యార్థులు తమకిష్టమైన రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలని తిరువూరు సెక్టార్–1 ఎస్‌ఐ సతీష్ అన్నారు. స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం పలు అంశాల్లో ప్రావీణ్యం చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ, గ్రంథాలయాధికారి పద్మావతి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చిన తెలుగు భాషా వికాససమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు, ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి వాణీ రంగారావు, ఉపాధ్యాయులు భరతకుమారి, నాగేశ్వరరావు, షేక్ మహబున్నీసా, రవి సత్కరించారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు
మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జెడ్.నాగిరెడ్డి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల ఎనిమిది నుంచి ఈ నెల11వ తేదీ వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, ఎంతో మంది గొప్పవారు గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకున్నారన్నారు. ముగింపు సభలో వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు టీ వెంకటేశ్వరరావు, విశ్రాంత అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్ అధికారి సత్యనారాయణ, తాడిగడప ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం
కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభలో జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబూషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన అభివృద్ధిలో గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం కలిగి ఉండాలని జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు అన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ శిక్షణ పొందిన అంశాలు వివరించారు.

విద్యార్థులకు పంచతంత్ర, నీతి కథలు
రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పంచతంత్ర, కథలు నీతి కథలు పుస్తకాలను ఆదివారం చదివించారు. అనంతరం ఉపాధ్యాయుడు గాదే మల్లికార్జునరెడ్డి విద్యార్థులకు స్వాతంత్ర్య నాయకుల చరిత్ర, స్పోకెన్ ఇంగ్లిష్, సైన్స్ గురించి వివరించారు. ముగింపు సభకు గ్రామ సర్పంచ్ మల్లాది రాణీ, ఎంపీటీసీ సభ్యులు రాబర్టు, కుప్పిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

గ్రంథాలయాలకు తగిన సమయం కేటాయించాలి
పెనుగొలను(గంపలగూడెం): విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు వచ్చి తగిన సమయాన్ని కేటాయించుకుని అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా పత్రికలు, గ్రంథాలు చదవాలని విశ్రాంతి ఎంఈఓ వి.శేషిరెడ్డి తెలిపారు. పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేవిస విజ్ఞాన శిబిరం ఆఖరి రోజు ఆదివారం నిర్వహించిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులకు షిరిడీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష అట్ట, పెన్ను, పెన్సిల్, బాక్స్ పంపిణీ చేశారు. పెనుగొలను సర్పంచ్ సందెపు లలిత, షిరిడీ సాయి సేవ సమితి సభ్యుడు నారాయణరావు పాల్గొన్నారు.

చాట్రాయిలో..
చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతి రోజూ విద్యార్థులకు రకరకాల ఆటలు, పాటలు, డ్యాన్సులు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముగింపు రోజు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, హైస్కూలు హెచ్ఎం సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్, చాట్రాయిలో హైస్కూలు హెచ్ఎం సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


నూజివీడులో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న ఆచార్య వెంకటరాము

నూజివీడులో..
నూజివీడు: విద్యార్థులు సెలవు రోజుల్లో, ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య వీ వెంకటరాము అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గత 35 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు నిలయాలన్నారు. అనంతరం శిక్షణ శిబిరంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. వాసవీ మహిళా క్లబ్ జిల్లా నాయకురాలు దారా లలిత, రిటైర్డ్ ఎంఈఓ వంగల గోవిందరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య, దాత దారా అనంద్, గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..
మండలంలోని గొల్లపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో గొల్లపల్లి హైస్కూల్ పీడీ పీ రవీంద్ర, హిందీ, తెలుగు ఉపాధ్యాయులు డీ దుర్గామల్లేశ్వరి, పుల్లారావులు విచ్చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు.

నేటినుంచి పాఠశాలల పునఃప్రారంభం


తిరువూరు మండలం అక్కపాలెంలో ఉపాధ్యాయుల బడిబాట

తిరువూరు: వేసవి సెలవుల అనంతరం తిరువూరు నియోజకవర్గంలో పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 210 పాఠశాలల్లో 19,600 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలో ఆరు రకాల కిట్లను పంపిణీ చేస్తారు. నూతన విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులకు కూడా సరిపడ కిట్లను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

ముమ్మరంగా ప్రచారం
తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో బడిబాట కార్యక్రమం చేపట్టి అన్ని గ్రామాల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషిచేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రభుత్వ స్కూళ్లలో నాడు–నేడు, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత యూనిఫాం, అమ్మ ఒడి తదితర పథకాల ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

శతజయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకట రత్న ప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిత్రకళ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ చిత్రకారులు, ఆంధ్ర అకాడమీ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ తెలిపారు. ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఆంధ్ర అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన ఆదివారం ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి అభ్యుదయానికి, వారిలో నూతన ఉత్సాహం నింపటానికి, క్రమబద్ధమైన జీవనానికి కళలు ఎంతో అవసరం అన్నారు. గతంలో కళలను రాజులు ప్రోత్సహించే వారని నేడు కళలకు ఆదరణ కరువయిందన్నారు. చిత్రకళారంగానికి ఎంఎస్‌మూర్తి చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం .ఆనందస్వరూప్, ఎంవీ సాయిబాబు మాట్లాడుతూ ఎంఎస్‌మూర్తి శత జయంతి వేడుకలు నవంబర్ 2023 నుంచి నవంబర్ 2024 వరకు జరుగుతాయన్నారు. ప్రతి నెలా చిత్రకళకు సంబంధించిన కార్యక్రమాలు, చిత్రకళ ప్రదర్శనలు, లెక్చర్స్, చిత్రకళ పోటీలు, సెమినార్‌లతో పాటు చిత్రకళలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ చిత్రకారులను సత్కరిస్తామన్నారు. ఎంఎస్‌మూర్తి శత జయంతి ఉత్సవాలలో చిత్ర కళాకారులు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చిత్ర కళాకారులు సృజన్, మల్లిక్, సునీల్, బీడీసీఎస్ ప్రసాద్, డీ దుర్గాప్రసాద్, పీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన గాత్ర కచేరీలు


సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: హరిద్ర మ్యూజిక్ అకాడమీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన గాత్ర కచేరీలు మధురంగా సాగాయి. ఉదయం 9 గంటలకు హరిద్ర, రిషిత కచేరీతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. సీనియర్ సంగీత కళాకారులు గాయత్రి, లలిత, సౌమ్య, సీహెచ్ పద్మ, అంజన,విష్ణుప్రియలతో పాటు హరిద్ర సంగీత శిక్షణా కేంద్రానికి చెందిన 50 మందికి పైగా చిన్నారులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను గానం చేశారు. కార్యక్రమాలను ప్రారంభించిన సంస్థ వ్యవస్థాపకుడు కె.సుబ్రహ్మమణ్యరాజు తమ లక్ష్యాలను వివరించారు. సంగీత కళాశాల విశ్రాంత గాత్ర విభాగం అధ్యాపకుడు ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, చిన్నారులను ఆశీర్వదిస్తూ ప్రసంగించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పోవూరి గౌరీనాథ్ పాల్గొన్నారు. గుంటూరు సంగీత కళాశాల పూర్వపు అధ్యాపకురాలు పాటిబండ్ల జానకిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

అలరించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై రాజమండ్రికి చెందిన శ్రీ కళా నృత్య నికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యనికేతన్‌కు చెందిన వేదామృత, జిష్విత, సాహితి, చేతన, దుర్గా, నందిని, ప్రియాంక, మనీష, శృజన, భువన, సౌమ్య, సాన్విక, ఝాన్సీభారతీ పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలి


చిట్టిబాబును సత్కరిస్తున్న ఉషారెడ్డి టీఎస్‌రావ్, శేషగిరి, దుర్గానాగమణి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఉషోదయ సింగర్స్ అసోసియేషన్ సన్ రైజర్స్ వ్యవస్థాపకురాలు ఉషా రెడ్డి అన్నారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ఎగిసే రాగాలై ఉష స్వరాలు పేరుతో అమర గాయకులకు స్వరనీరాజనం, కళా సంస్థల ప్రతినిధులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఉషారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసముందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది కార్యక్రమాలు నిర్వహిస్తూ కొత్త వారికి ప్రోత్సాహం ఇస్తునట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబును నిర్వాహకులు సత్కరించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఇప్పటికి నగరంలో 30 ఏళ్లగా రెండువేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు టీఎస్ రావు, శేషగిరి, గాయని దుర్గానాగమణి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు ఘంటసాల, బాల సుబ్రహ్మమణ్యం, పి. సుశీల, చిత్ర, ఎస్. జానకి, భానుమతి గీతాలు ఆలపించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రజల ప్రశాంత జీవనానికి ఆటంకం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా కొనసాగుతుందని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రమం తప్పకుండా పోలీస్ స్టేషన్ వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని చెప్పారు. రౌడీషీటర్లపై ఫిర్యాదులొస్తే నగర బహిష్కరణకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో కమలానంద భారతీ స్వామిజీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గన్నవరంలోని భువనేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిని స్వామిజీని అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

నేడు కోదండ రామాలయం ప్రతిష్ట



కావవరం(ఇబ్రహీంపట్నం): కావవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ప్రతిష్టను పురస్కరించుకుని మూడు రోజులుగా ఆలయం వద్ద విశేష పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి అప్పారావు నిర్మించిన ఆలయం, సీతా రామచంద్రుడు, లక్ష్మణుడు, హనుమత్ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా నిర్వహించనున్నారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల విడుదల

తిరువూరు: విజయవాడలో ఈ నెల 29న జరిగే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ సభ కరపత్రాలను ఆదివారం తిరువూరులో ఆవిష్కరించారు. స్థానిక రాజుపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ మారబత్తుల గోపాల్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే ఆవిర్భావ దినోత్సవ సభకు అన్ని గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంచాల మల్లేశ్వరరావు, కన్నెపోగు ప్రసన్నకుమార్, వెంపాటి డైమండ్, రంజిత్‌కుమార్, పింగళి నారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

నూజివీడు: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవరగుంట అడ్డరోడ్డు వద్ద ఆదివారం రహదారి ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను నిలిపివేసి హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆకట్టుకున్న స్వరాంజలి



విజయవాడ కల్చరల్: తెలుగు సినీ రంగ త్రిమూర్తులు అక్కినేని, ఎన్టీఆర్, కృష్ణ నట జీవితాలను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు మారేపల్లి జోషి అన్నారు. చిత్రలహరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం స్వరాంజలి కార్యక్రమం నిర్వహించారు. జోషి మాట్లాడుతూ అక్కినేని, ఎన్టీఆర్, కృష్ణలు తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలను నిర్మించారని తెలిపారు. తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలుగా అభివర్ణించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు కృష్ణకుమారి, రూపాశ్రీ, సింధూ, డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభు, సయ్యద్ ఆలీ, పి.శ్రీనివాసరావు, ఒమ్మి రామశంకర్, పసుపులేటి బాబూరావు చిత్రగీతాలను ఆలపించారు.

19 నుంచి వారాహిదేవి నవరాత్రులు


శ్రీలలితాంబికా పీఠంలో అమ్మవారి మూలవిరాట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని లలితాంబికా పీఠంలో 19వ తేదీ నుంచి వారాహిదేవి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పీఠాధీశ్వరి శివలీలా మాతాశ్రీ పేర్కొన్నారు. 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 28వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ఉత్సవాల్లో అమ్మవారిని రోజుకో విశేషమైన అలంకారంలో భక్తులు దర్శించుకోవచ్చన్నారు. బ్రాహ్మీ ముహూర్తం నుంచి 7 గంటల వరకు , సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత అమ్మవారికి పంచహారతుల సేవ జరుగుతుందన్నారు.
19న ఆదివారాహి, 20న జయవారాహి, 21న పోత్రిణీ వారాహి,
22న మహా వారాహి, 23 న బృహత్ వారాహి, 24న ఘోర వారాహి,
25న నారాయణీవారాహి, 26 న వార్తళి వారాహి, 27న స్వప్నవారాహి, 28న మహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరిస్తారు.

